# తుట్టి

"తుట్టి పడి పోయినాదయ్యా బిడ్డ బతుకు! ఏం జెయ్యవల్నో తెల్వకుండున్నది!" అప్పుడే పోట్లాడి వచ్చింది ఆదెమ్మ, కమీషను ఏజెంటు గంగాధరంతో, రెండున్నర కిలోల ఆకు 'తుట్టి' పడిందని లెక్కేసి, పైసలు తెగ్గోసినందుకు.

"మన కర్మ! ఏంజేస్తం? ఏదొచ్చిన అనుబగించాలి" అన్నాడు ముసలయ్య.

నేరం రుజువు కాలేదని గురప్పను విడుదల చేసిన తరువాతి మాటలు అవి. ముసలయ్య అలా అన్నాడో లేదో అంతే, సత్తు చెంబొచ్చి తాత వీపును ఠక్కున తాకింది.

"ఛస్తిని! నీయమ్మ కడుపుడక! ఏంగొట్టినవె? నడుం ఇరిగినాది."

"చంపుత, ముసలి నా కొడక, మళ్ళ కర్మ అన్నవంటే?" అనరిచింది శంకరి.

"ముందు నువ్వు ఆ లోటాలు, గళాసులు విసురుడు మానెయ్యి. తగలరాని చోట తగిల్తే పానాలు పోతయ్యి" అన్నాడు తాత.

"కర్మ కాకేందే మరి, దారిన బొయ్యే తద్దినాన్ని నెత్తిన తెచ్చుకుంటివి. పోనీ అయిపోయిందేదో అయిపోయినాదని ఊరుకుంటివా? పోలీసు నాకాల కంప్లయింటు చేసిందాక మీ తాత పానం తీస్తివి! ఇప్పుడేమాయె! ఆడు మీ తాత మొగానూసి, 'ఒరేయ్, ముసలోడా, నీ గుడిసెలోనె కాపరం బెడత! ఏం జేస్తవో చేసుకో పో' అనవట్టె! ఎన్నాళ్లిట్ల బయంబయంగ బతకాల్నె బిడ్డ! ఇదంతా కర్మ గాకేంది?" అంది అమ్మమ్మ ఆదెమ్మ.

"మీ వల్ల కాకపోతే, నేను చంపుత ఆ కొడుకుని. శంకరంటే ఏమనుకుంటుండో ఆ తప్పుడు నాకొడుకు! ఆడి మొల్దారం దెంప! ఆడి దినాలుగాను! ఆడి చేతులకు జుట్టలు పుట్ట!"

"నువ్వు ముందెళ్ళి గడ్డి కోసుక రాయె. పసువు పచ్చిగడ్డి లేక వసిమారి పోతా ఉండాది. గాటి తాన దాని గోడు చూత్తా ఉంటే నా పాణం కడబట్టి పోతండాది. గోకుడు గడ్డన్నా ఓగంపెడు దొరుకుద్దేమో నంటే యేడా కనుచూపు మేరలో గడ్డి ఊసే లేదాయె!"

అమ్మమ్మను తిట్టుకుంటూ శంకరి గంపతీసుకుని గడ్డి కోసుకు రావటానికి వెళ్ళింది. ఇప్పుడామె కంపెనీకి కూడ వెళ్ళటం లేదు. ఆ దుర్ఘటన జరిగాక, అందరూ అనేమాటలు భరించలేక, బీడీలు చుట్టే పని మానేసింది.

ముసలయ్యకూ బతుకులో ఎన్నో సమస్యలు. అతడికి రెండెకరాలు ఖుష్కీ ఈనాం భూమి ఉంది. ఖుష్కీ భూమిలో వేరు శనగలు వేశాడు, నాలుగైదు విడతలుగా. భూమి లోకి పోయిన విత్తనాలు భూమి లోనే కునారిల్లి పోయాయి. మొక్క పైకొస్తే ఒట్టు! వానల్లేకుండె. వానలు కురిసి మొక్క పైకొస్తూంటే దానికి డిఏపి యూరియా ఖర్చుబెట్టి వేసుకున్నా దిగుబడి అంతంత మాత్రమే అయింది. వచ్చిన ఫలసాయంల్లో, తిండిగింజలే కొనుక్కోవాలో, ఇతర ఖర్చు లెట్లా వెళ్ళదీయాలో తెలియని అయోమయంలో పడ్డాడు ముసలయ్య. ఈ మధ్య పాండురంగయ్య సతాయింపు అధికమయింది. శంకరికి బీడీకార్డు సంపాదించటానికి, ఐదు వేలు అవసరపడితే అతని దగ్గర అప్పు తీసుకున్నాడు. విత్తనాలు, పురుగుమందులు, ఎరువులు తనతని దుకాణంలోనే కొంటాడు. అరువుకు తెచ్చుకుంటాడు. కిందటేడు పంట బాగాలేక బాకీ కింద ఏమీ జమ చెయ్య లేక పోయాడు. తను పనిబడి దుకాణం కెళ్ళినప్పుడల్లా పాండురంగయ్య గునుస్తూనే ఉన్నాడు, “ఏందన్నా ఏం జమ చెయ్యకుంటివి? గిట్లయితె, మేం యాపారం బందు బెట్టాల్సి వస్తది” అని. ఇవి తేలని సమస్యలు. వాటికి తోడు శంకరి సమస్య!

ఆ ముసలి దంపతులకు లేకలేక ఒకతే కూతురు భూలక్ష్మి కలిగింది. ఒక్కతే కూతురు కనుక గారాబంగానే పెంచారు, నూలు మిల్లులో పనిచేసే నరసింహ కిచ్చి పెళ్ళి చేశారు. తల్లి చాలేమో, కాపురానికెళ్ళిన పదేళ్ళకు గానీ ఆమె గర్భం ధరించలేదు. కాన్పు కష్టమై చనిపోయింది. అల్లుడు మళ్ళా పెళ్ళి చేసుకోటంతో, మనవరాలు సవతి తల్లి చేతిలో ఏం కష్టాలు పడుతుందోనని భావించిన అమ్మమ్మా, తాతలు ఆ పసిగుడ్డును తామే తీసుకువచ్చి పెంచారు. తల్లీదండ్రీ ఎరక్కుండా పెరిగింది శంకరి. తల్లి లేని పిల్ల అని గారాబంగా పెంచటంతో, ఆమె మకురుగానూ తయారయింది. అవ్వ గారాబంతో బడికి వెళ్ళలేదు. చదువు అరిష్టమన్న నమ్మకం తమ కులంలో ఉన్నదే. తన కూతుర్ని బడికి పంపి ఐదు దాకా చదివించినందుకే ఆమె చనిపోయిందని నమ్మిన ముసలయ్య శంకరి బడికి వెళ్ళాలని పట్టుబట్ట లేదు.

ఆదెమ్మ చన్నీళ్ళకు వేణ్ణీళ్ళన్నట్టు, భర్తకు సాయంగా ఉంటుందని బీడీలు చుట్టే పని ప్రారంభించింది. రుద్రూరులో బీడీ వ్యాపారానికి సంబంధించిన ఏజెంటున్నాడు. బీడీల రోలింగ్ పని ఇంటికే ఇచ్చేవాడు. సాయంత్రం చుట్టిన బీడీలు ఇచ్చేశాక, మళ్ళా

తునికాకు, తంబాకు, దారం లెక్క ప్రకారం ఇచ్చేవాడు. ఆకెప్పుడూ తుట్టె (తక్కువ) పడేది ఆకును ఇంటికి తీసుకొచ్చి నానబెట్టి, సైజుకు కత్తిరించి, బీడీలు చుట్టేది ఆదెమ్మ. మనవరాలు కూడా దారం చుట్టే పనిలో ఆమెకు సాయం చేస్తుండేది. తనుకూడ ఆ పని చేస్తానంటే ఆదెమ్మ శంకరిని నిరుత్సాహ పరిచింది.

"నీడ పట్టున కూసుండి చేసుడే అనుకుంటివేమొ. పానం ఉండగనె గోరీ కట్టే నౌకరీనే ఇది. పొయ్యేకొందికీ తెలుస్తాది. కూసుండి కూసుండి నడుం పోతది. దారం సుట్టి సుట్టి కండ్లు బోతయి. తంబాకు గాటు పడక బీమారవుతవు..."

"ఏం బీమారనయినవే నువ్వు! తియ్, నా మనసు మల్లించె మాటలు చెప్పక" అంది శంకరి.

"మీ తాత రెడ్డోరింటో పనిచేసెటోడిని చూసెనంట! ఆడితో నీలగ్గం చేస్తె మంచిగుంట దన్నడు. యెవుసపు పని అల్కగుంటది. నీకీ పనొద్దే. నామాటిను."

అయితే, ఆమె పట్టుబట్టటంతో, మనవరాలికీ బీడీలు చుట్టేపని ఇప్పించింది ఆదెమ్మ. శంకరి కప్పటికి పదహారేళ్ళే. ఉత్సాహం పొంగులువారే వయసు. కార్మికులకు జరిగే ద్రోహం పట్ల ఆమెకు ఆగ్రహం కలిగినా, నెలనెలా ఎంతో కొంత డబ్బు చేతిలో పడటం చూశాక, ఆమె మనసు ఆ వృత్తి పట్ల ఆకర్షితమయింది. పనికోసం గురప్ప నాశ్రయించింది. శంకరికి అతనితో పేచీ, కార్డిప్పించటంలోనే మొదలయింది.

బీడీ కార్మిక వ్యవస్థ రెండు విధానాలయిన యాజమాన్యాల క్రింద పని చేస్తుంది. కార్మికులు- కార్మికురాళ్ళనటం సబబు, ఎందుకంటే ఇందులో తొంభై శాతం మంది మహిళా కార్మికులే- కమీషను ఏజెంట్ల క్రింద పని చేస్తుంటారు. ఈ ఏజెంట్లు యజమానికీ, కార్మికులకీ మధ్య దళారులు. తక్కువ కమీషను ఇవ్వటం ద్వారా యజమానులు వీరిని దోపిడీ చేస్తే, వీరు కార్మికులకు ఆకు, తంబాకు తక్కువ వేసి, బట్వాడాలు ఎగగొట్టి, అక్రమ కోతలకు పూనుకుని కార్మికులను దోపిడీ చేస్తుంటారు. ఇలా కమీషను ఏజెంట్ల వద్ద కాక సీదా యజమానుల వద్దే కంపెనీల్లో పని చేసే వాళ్ళుకూడ ఉంటారు. యజమానులు మేనేజర్లను లేక మునీమ్‌లను నియమించి, కార్మిక స్త్రీల చేత పని చేయించుకుంటూ ఉంటారు. అలాగని సేటులేం పెద్ద పెద్ద కార్ఖానాలు తెరవరు. ఒక్కో బస్తీలో ఇళ్ళు కిరాయికి తీసుకుని పని నడిపిస్తుంటారు. వాటినే కంపెనీ లంటారు. రోజుకు కనీసంవెయ్యి బీడీలయినా ఒక్కో కార్మిక స్త్రీ చుడుతుంది. పదిహేను వందలు కూడా చుడుతుంటారు. వెయ్యా, పదిహేనువందలయినా చుట్టకపోతే కార్మిక స్త్రీలకు గిట్టుబాటు కాదు.

ఆంధ్రప్రదేశ్‌లో బీడీ పరిశ్రమ తెలంగాణ జిల్లాలలో- నిజామాబాదు, అదిలాబాదు, కరీంనగరు, మెదకు జిల్లాలలో- విస్తృతంగా వ్యాపించి ఉంది. వరంగల్లు, రంగారెడ్డి, హైదరాబాదు, మహబూబ్ నగర్ లాంటి జిల్లాల్లో చిన్న చిన్న పాకెట్లకు పరిమితమై ఉంది. అలాగే తీరాంధ్ర, రాయలసీమల్లోనూ ఈ పరిశ్రమ నెలకొని ఉన్నా, దీనికి పట్టుకొమ్మ ఉత్తర తెలంగాణానే. ఈ ఉత్తర తెలంగాణ జిల్లాలో సామాన్యంగా యజమానులు మార్వాడీ, గుజరాతీ సేటులు. వాళ్ళని చూశాకే ఈ పరిశ్రమ అంతగా వ్యాపించి ఉండని ప్రాంతాల్లో స్థానికులు కూడా ఈ వ్యాపారాన్ని చేపట్టారు. సామాన్యంగా జిల్లా ముఖ్య కేంద్రంలో వాళ్ల హెడ్డాపీసు ఉంటుంది. రెవెన్యూ డివిజన్ల లాగ, పట్నాల్లో సబాఫీసులూ ఉంటాయి. పైకి కన్పించని పెద్ద వ్యాపారం ఇది. సుమారుగా డెబ్బయి లక్షల కార్మికులు ఈ పరిశ్రమలో జీవనోపాధి వెతుక్కుంటారు. వీరు సామాన్యంగా అణచివేతకు గురయిన, నిమ్న వర్గాల నుండి వస్తూ ఉంటారు.

హెడ్డాపీసులో సిబ్బంది ఉంటుంది; గోదాములుంటాయి. నానబెట్టిన ఆకులలో పచ్చేమన్నా మిగిలి ఉంటే అది పోయేందుకు, తయారయి వచ్చిన బీడీలను వెచ్చచేసేందుకు బట్టీలు. ఆ పనిచేసే బట్టీవాలా లుంటారు. బీడీల కట్టలకు రాపర్లు తగిలించి పంపటానికి సిద్ధం చేసే పాకర్లు ఉంటారు. చిన్నాఫీసుల నుండి హెడ్డాపీసుకు బీడీ కట్టలను మోసుకెళ్ళే గంపావాలా లుంటారు. ఎక్కడెక్కడో కంపెనీల్లో తయారయిన బీడీలు గంపల్లో వచ్చి చేరతాయి. బీడీలను ఛాటన్ చేసి చెన్నీల్లో నింపి బట్టీ పెడతారు. ఆ తర్వాత పాకింగయి, ఊళ్ళకు రవాణా అవుతాయి.

ఏ దేశంలోని ఏ పరిశ్రమలోనూ ముడిసరుకు తక్కువ పడితే, కార్మికులు తమ డబ్బుతో కాని దాన్ని భర్తీ చేసేపద్ధతి లేదు. రైతు ఎంత నారిస్తే అంతే నాటుతాడు నాటుకూలీ. తక్కువ పడితే తను నారు కొనుక్కు రాడు. కానీ ఇక్కడి పరిస్థితి విపరీతం. తునికాకుతో బీడీలు చుడ్తారు. మంచి తునికాకు ఇవ్వకుండా, నాసిరకమయిన పగులుదు, ముక్కుడు, దొడ్డు, చిన్న, రేజ, నల్లాకు, సొప్పకట్ట లాంటి ఆకును వెయ్యి బీడీలకని చెప్పి ఇస్తే, ఇచ్చిన ఆకులో అన్ని బీడీలు తయారు కావు. తుట్టి(తక్కువ) పడిన ఆకును కార్మికులు కొని భర్తీ చేయాలి. అలాగనే తంబాకు కూడ తుట్టీ పోవచ్చు. బీడీ పరిశ్రమలో కార్మిక సంఘాల కృషి ఫలితంగా, కార్మికులకు ప్రావిడెంటు ఫండు, బోనసు, పెన్షను సౌకర్యంకూడ ఏర్పడ్డాయి. వీటికి అర్హులు కార్డులున్న కార్మికులే. దీన్ని ఫారం అని కూడ అంటారు. ఏ కార్మికురాలు ఏ రోజు ఎన్ని బీడీలు చుట్టింది నమోదు చేసే ఫారమే ఆ కార్డు. బోనసు నిర్ధారించటానికి కూడ ఆ కార్డే ఆధారం. ఆ కార్డుల కోసం కార్మికురాళ్ళు వెంపరలాడు తుంటారు. అది అవినీతికి, లైంగిక దోపిడీకి కూడా దారి తీయటం జరుగుతూ ఉంటుంది.

సహజంగానే శంకరి కూడ కార్డు సంపాదించాలని ప్రయత్నం చేసింది. అప్పుడే ఆమెకు గురప్పతో పరిచయ మయింది. అతడు సేఠ్ మురారీలాల్ ఝున్‌ఝున్‌వాలా బీడీ కార్ఖానాలో గంపావాలాగా పనిచేస్తున్నాడు. అతడిది మహబూబ్‌నగరు జిల్లా కొడంగల్. అక్కడ అతన్ని అంతా గురవప్ప అని పిల్చేవారు. తన ఊరి నుండి పారిపోయి నిజామాబాదులో తేలాక అతడి పేరు కురచబారి గురప్ప అయింది. సేఠ్ మురారీలాల్‌కు దగ్గరి వాడయాడు. సేటులకు అప్పుడప్పుడు రౌడీలతో పని బడుతుంటుంది. ఎవడిపైనయినా దౌర్జన్యం చెయ్యటం, అవసరమనిపిస్తే చెయ్యి చేసుకోటం, మరింత అవసరం కలిగితే తన యజమాని పక్షాన జెయిలుక్కూడా వెళ్లటానికి సందేహించని వాడు గురప్ప. అందువల్ల సేఠ్ అతణ్ణి తన బడితెగా ఉపయోగించుకోటానికి దగ్గరకు తీశాడు. తన కార్ఖానా రుద్రూరులో తెరిచేటప్పుడు ఇతణ్ణక్కడ గంపావాలాగా నియమించాడు సేఠ్. సేటుతో తనకున్న సాన్నిహిత్యాన్ని ఆసరా చేసుకుని మెల్లగా డబ్బు సంపాదించే మార్గాలు వెతికాడు గురప్ప. కార్డులిప్పించటం లాభసాటి వ్యాపారమనిపించింది అతనికి. మునీమ్ రాజయ్యతో చేతులు కలిపాడు.

"నీకు కారటిప్పిస్తా. నాకు పదివేలివ్వు" అన్నాడు గురప్ప నదరుగా కన్పించిన శంకరితో.

"పదేలే, నాతానెక్కడివి?" అంది శంకరి.

"పైసల్లేవంటే కారటు సంగతి మర్చిపో. మస్తుమంది కారటు ఇప్పించమని అడుగుతుండరు. నువ్వు జాంపండోలుంటవ్! అందుకే నీకిప్పిద్దా మనుకుంటి. పైసల్లేకపోతే కారటు రాదు" అన్నాడు గురప్ప.

"రెండు రోజులాగు. మా తాత నడిగి చెప్తా" అంది శంకరి.

ఇంక ఇంటికొచ్చినప్పటి నుండి ముసలయ్యను సతాయించటం మొదలెట్టింది ఆమె.

"పదివేలు నా తాన ఏడవే? లెవ్వు. మీ అవ్వ కమీషను ఏజెంటు కాడే నువ్వూ పని జేస్తుంటివి గందా? ఇంకేం గావల్నే?"

"ఆ బతుకు గొంగడి బతుకు! ఎదుగూ బొదుగూ ఉండదు. కారటు సంపాదించినవా, ఇంక నిన్నడిగెటోడుండడు. నాకు పైసలు గావాలి. నువ్వెట్ల తెస్తవో, నాకు తెలవదు" అంది శంకరి మొండిగా.

"లగ్గం జేసి పంపే వయసొచ్చినాది. నీకిప్పుడు కారటెందుకే" అని ఆదెమ్మ అన్నా ఆమె విన్పించుకోలేదు, తన మొండి పట్టు విడువ లేదు.

ఇంక ముసలయ్యకు తప్పలేదు. కోమటి పాండురంగయ్య నడిగాడు అప్పు. అతడు గునిసి, గునిసి ఐదువేలిచ్చాడు. అది తీసుకెళ్ళి శంకరి గురప్ప కిచ్చింది. అతడు, “ఇదేందేవ్, పదేలంటే, ఐదేలు చేతిలో బెట్టినవ్. దీన్తో పనిగాదు. నువ్వు పదిస్తే, నాలుగుగా మునీమ్‌గాడే మింగుతడు. మిగలుడు సేటు తింటడు. నేనుపైస ముట్ట! నిన్ను చూసి మనసుపడి నీకు సాయం చేద్దమనుకుంటి గాని పైస బెట్టమంటే నా వల్లగాదు” అన్నాడు.

శంకరి అతడిని బతిమాలుకున్నది. కాళ్ళావేళ్ళా పడింది. “బాన్చన్! నీకాల్మొక్త!. నవ్వేట్ల గయిన నాకీ సాయం జెయ్యాల!” అంది

“మరి గయితే నీకు కారటొచ్చినాక నాకు నెలకింతని జెప్పి ఐదువేలు బాకీ తీర్చాల” అన్నాడు అతను.

“చూద్దాంలే, నువ్వయితే ఐదేలమీద ఆశెట్టుకునేవు, మల్ల! నా చాతనయితే దీరుస్త. లేకుంటే పుణ్యానికి చేసినవనుకో”

“ఎందుకు జెయ్యాల్నే, పుణ్యానికి! నా అమ్మంక చుట్టంవా, అయ్యంక చుట్టంవా నువ్వు? అట్ల కుదర్దేవ్! నా పైసల్నాకిచ్చి తీరాల.”

అలా గురప్ప ఆమెకు అప్పుడే గట్టిగా చెప్పాడు. అతడికి తనమీద లౌల్యం ఉన్నదని గ్రహించిన శంకరి, దాన్ని తన ప్రయోజనానికి ఉపయోగించుకోవాలనుకున్నది. అయితే, గురప్పకు శంకరి పట్ల వ్యామోహం ఉన్నమాట నిజమే కానీ, ఆడపిల్ల వ్యామోహంలో పడి డబ్బు వదలుకునే బాపతు మనిషి కాదతను. ఆదివారం వస్తే చాలు అతడు నిజాంబాదులోనే ఉంటాడు. అతను తిరగని ముండల కంపెనీల్లేవు, తాగి పడని కల్లు దుకాణాల్లేవు. అందుకు డబ్బు కావాలి. ఆ డబ్బు కోసం అతడు అనుసరించే మార్గాల్లో ఇదొకటి.

శంకరికి కార్డు వచ్చింది. బీడీలు చుట్టి సంపాదించే దాన్లో కొంత పాండురంగయ్యకు బాకీ కింద జమకట్టక తప్పటం లేదు ముసలయ్యకు. ఐదువేలు బాకీ ఇచ్చేటప్పుడే అతడు పొలం కాయితాలు తనఖా పెట్టుకున్నాడు. పొలం చెయ్యి దాటితే ప్రాణం పోయినట్లుంటుంది ముసలయ్యకు. శంకరికి కార్డొచ్చిన మూడు నెలల దాకా గురప్ప మాట్లాడలేదు. నాలుగో నెలలో, “నా పైసలేంజేసినవే?” అనడిగాడతను, బీడీలు చుట్టటానికి కంపెనీ కొచ్చిన శంకరిని.

“ఏం పైసలు?” అనడిగింది ఆమె, అమాయకపు మొహం పెట్టి.

“కారటు పైసలు! నా సంగతి నీకు తెల్సు, రేపట్నెలనుండి ఇవ్వు.”

"నా తాన లెవ్వు. నీకప్పుడె జెప్పిన, పుణ్యానికి జేసినవనుకోమని."

"అట్ల కుదర్దని నేనూ జెప్పిన. ఇవ్వకుంటివో, నేనేంటో నీకు తెలుస్తాది."

"ఏం జేస్తవేఁ?"

"నీ నౌకరీ పీకిస్త."

"పీకించు, తెలుస్తది. యూనియన్లున్నయ్యేందుకు?"

ఆవిషయం గురప్పకు తెల్సు, కార్డు ఇప్పించినంత తేలిగ్గా తీసేయించలేదని. వయసు పొంగులో ఉన్న ఆమె అతని బెదరింపును లక్ష్యం చెయ్యలేదు. ఆర్నెల్లు గడిచాక, అతడు ముసలయ్యను కల్సి బెదిరించాడు. పాండురంగయ్య బాకీ తీరగానే అతని బాకీ చుప్తా చేస్తానని ముసలయ్య చెప్పాడు.

"మరి గంతదాకా నీ మనవరాల్ని నా తాన పండబెట్టు" అన్నాడు గురప్ప.

"చంపుతా, నా కొడక! ఏం కూసినవురా! పద, నీ సేటు తాన చెప్తా."

మాటమీద మాట పెరిగింది. పోలీసులకు కంప్లెయింట్ చేశాడు ముసలయ్య. ఎస్.సి, ఎస్.టి అట్రాసిటీస్ చట్టం క్రింద గురప్ప పై కేసు పెట్టారు పోలీసులు. దాంతో సేఠ్ మురారీలాల్ ఝున్‌ఝున్‌వాలా కదిలాడు. పోలీసులకు తినబెట్టాడు. తన రక్షణకోసం ఇలాంటి 'తుట్టి' (నష్టం) తప్పదని అతనికి తెలుసు. గురప్ప బెయిలు మీద బయట పడ్డాడు.

అప్పటికి మాట్లాడకూరుకున్నాడు గురప్ప. నాలుగురోజుల తర్వాత చీకటి పడి పొలం నుండి తిరిగొస్తున్న ముసలయ్య కాలు మీద ఎవరో బలంగా లాఠీతో మోదారు. అతని కాలు విరిగింది. చీకటిలో తనపై ప్రహారం చేసిన వారెవరో గుర్తుపట్టలేక పోయాడు. శంకరి తాతను నాటువైద్యుడి దగ్గరకు తీసుకెళ్ళింది. ఆ పనిచేసిందెవరో పసిగట్టగలిగారుకానీ, ముసలయ్యగానీ, శంకరిగానీ పోలీసులకు ఫిర్యాదు చెయ్యలేక పోయారు.

బాకీపడి ఎగగొట్టిన అపరాధ భావన వారి నా పని చెయ్యనివ్వలేదు. నెల రోజులకు ముసలయ్య కుంటుకుంటూ కర్ర సాయంతో నడవసాగాడు. అంతయినా శంకరి తన బాకీ తీర్చనందుకు మండిపోయాడు గురప్ప. మరొక రోజు మరేదో వంకతో కంపెనీ దగ్గర ఆమెతో తగవేసుకున్నాడు గురప్ప. పక్కవాళ్ళు కలగజేసుకున్నాక అది అక్కడికి సమసి పోయింది.

ఓ రోజు మిగతా కార్మికురాళ్ళతో చీకటి పడ్డాక కంపెనీ నుండి తిరిగివస్తూ, తన వీధిలోకి మలుపు తిరగ్గానే ఆమెనెవరో వెనకనుండి పట్టుకుని, నోరుమూపి ముక్కుకు

ఏదో మందు వాసన చూపారు. ఆమె క్షణంలో స్పృహ కోల్పోయింది. తెల్లవారి స్పృహ వచ్చి చూసుకున్నప్పుడు కానీ తనేం కోల్పోయిందో ఆమె కర్థం కాలేదు.

"మంచి పసందుగున్నవే! ఇంక నీ బాకీ రద్దయినాది. ఎప్పుడో ఓ పాలొచ్చి వడ్డీ మాత్రం తీర్చిపోతావుండు" అని చెప్పి ఆమెను ఇంటికి పంపేశాడు గురప్ప.

రాత్రి పిల్ల ఇంటికి తిరిగి రాకపోయేసరికి తాతా, అమ్మమ్మా హైరాన పడిపోయారు. ఆమెతోటి కార్మికురాళ్ళను ప్రశ్నించారు కానీ ఆమె ఆచూకీ తెలియలేదు. గురప్ప మీద అనుమానం పోయింది. అతని ఇల్లు తెలియక, మునీమ్ రాజయ్యను అడిగితే, గురప్ప సాయంత్రమే గంపెత్తుకుని నిజాంబాదు వెళ్ళిపోయాడని చెప్పాడు. 'అతడి ఇల్లు తనకూ తెలియదు. ఆ అవసరం తనకెప్పుడూ పడ లేదు. వాడెప్పుడూ కంపెనీలోనే ఉంటాడు.' వాళ్ళు పరువు భయంతో పోలీసులకూ కంప్లెయింట్ చెయ్యలేక పోయారు.

పొద్దున ఇంటికి తిరిగొచ్చిన పిల్లను చూసి నిశ్చేతనులై పోయారు. ఏం జేయాలో వాళ్ళకు తెలియలేదు. విషయం బయటికి పొక్కితే, పరువుపోతుందనీ, పిల్లకు పెళ్ళికావటం కష్టమనీ నోరు నొక్కుకున్నారు. శంకరి ఆరోజల్లా దిగ్భ్రమలో ఉండిపోయింది. విపరీతమయిన అవమానం, తన నిస్సహాయత పట్ల ఏవగింపు కలిగింది ఆమెకు. తన చేతగానితనాన్ని తల్చుకుని కుమిలిపోయింది ఆమె. ఆ మర్నాటికిగానీ ఆమెలో తెగింపు రాలేదు. 'ఏమయితే అది అయింది. తను నాశనమయినా సరే, వాడిని శిక్షింప చేయాల్సిందే!' ఆ భావన కలిగాక ఇంక ఆమె తాతకు ఊపిరి సలుపనివ్వలేదు, పోలీసులకు ఫిర్యాదు చేసిందాకా. ఆమెను వైద్య పరీక్షకు పంపారు, గురప్పను నిర్బంధంలోకి తీసుకుని నిజాంబాదు కోర్టులో కేసు పెట్టారు పోలీసులు. ఇంత జరిగాక రెడ్ల దగ్గరపని చేసే పాలేరు శంకరిని చేసుకో నిరాకరించాడు.

డబ్బుకు, పలుకుబడికి సత్యాన్ని తారుమారు చేయగలిగిన శక్తి ఉంది. కోర్టులో కేసు సాగిసాగి రెండేళ్ళకు ఓ కొలిక్కి వచ్చింది. నేరం జరిగిన రోజు గురప్ప నిజాంబాదులో ఉన్నాడు. కంపెనీ మానేజరు ఇందుకు సాక్ష్యం పలికాడు. శంకరికి రెండురోజుల తర్వాత జరిగిన వైద్య పరీక్షలో ఇదమిత్థంగా ఏమీ తేలలేదు. ప్రాసిక్యూషన్ నిర్ద్వందంగా నిందితుడు నేరం చేసినట్టు నిరూపించటంలో విఫలమయింది కనుక కోర్టు కేసును కొట్టేసింది. ఇదే సమయంలో ఎస్. సి, ఎస్.టి అట్రాసిటీస్ కేసును కూడ కలిపి విచారణ చేశారు. అందులో అతనికి సంవత్సరం పాటు శిక్ష పడింది. అయితే, రేపు కేసులో రెండేళ్ళు శిక్ష అనుభవించాడు కనుక, దాన్ని మాఫీ చేశాడు జడ్జీ. రెండేళ్ళు జెయిల్లోఉన్న గురప్ప రుద్రూరుకు తిరిగొచ్చి,

"ఒరేయ్, ముసలోడా! ఈ సారి నీ గుడిసెలోనె కాపరం బెడత! ఏం జేస్తవో చేసుకో ఫో" అని బెదిరించి వెళ్ళాడు.

ముసలి తాత, అమ్మమ్మ పరిస్థితిని 'కర్మ' అని సరిపెట్టుకో జూశారు. ఉడుకు రక్తం శంకరి అలా సమాధాన పడలేక పోయింది. గురప్ప విడుదలై వచ్చాడని తెలిసినప్పటి నుండీ ఆమె ఏదో తీవ్ర అజ్ఞాత ద్రోహానికి తను గురయినట్టు భావించసాగింది. ఆ తర్వాత గురప్ప తమ ఇంటికి వచ్చి ఆ కూత కూశాక ఆమెలో మళ్ళా ఆత్మవినాశక భావం జాగృతమయింది. ఓ రోజు పొద్దున్నే తాత, అవ్వలకు చెప్పకుండ, నిజామాబాదుకు వెళ్ళింది. తన పట్ల ఇంత అధర్మంగా ప్రవర్తించిన న్యాయమూర్తిని నిలదీయాలన్న తపన ఆమెకు ఊపిరి సలపనివ్వలేదు. ఆవేశమే కానీ ఆలోచన లేని పిల్ల!

కోర్టులో అదే జెడ్జి ఉన్నాడు. న్యాయమూర్తి ఆమెను గుర్తించాడు. ఆమె తనకేదో చెప్పదల్చుకున్నదన్న ఉద్దేశంతో, "ఏం పని, ఇక్కడి కొచ్చావు?" అనడిగాడు.

ఆ ప్రశ్నతో ఆమెకు మండి పోయింది. తను ఇచ్చిన తీర్పు వల్లే కదా, తనక్కడికి రావల్సి వచ్చింది! అంతే, ఆమె చెప్పుతీసి, న్యాయమూర్తి కేసి విసరింది. అది ఆయనకు తగల లేదు. టేబుల్‌కు తగిలి కింద పడి పోయింది. ఇక్కడున్న ఉద్యోగులు, లాయర్లు ఆమెను పట్టుకోక పోయినట్టయితే ఆమె మరో చెప్పును కూడ విసరేసేదే! న్యాయమూర్తి కూడ ఖంగుతిన్నాడు. వెంటనే ఛీఫ్ జుడీషియల్ మాజిస్ట్రేట్‌కు వ్రాతపూర్వకంగా పిర్యాదు చేశాడు. పోలీసులు ఆమెను ఐపిసి 228, 353, 332 సెక్షన్ల క్రింద అరెష్టు చేస్తే, న్యాయమూర్తి ఆమెను 15 రోజుల జుడీషియల్ కస్టడీకి పంపించాడు.

ఆమెను అదుపులోకి తీసుకున్న పోలీసు ఆఫీసర్‌తో అన్నాడు న్యాయమూర్తి: "నా కామె బాధ తెలుసు. ఆమెంటే జాలి కూడా ఉంది. కానీ, ఆమెను క్షమించి వదలలేను. ఇవాళ ఈ పిల్ల నొదిలేస్తే, న్యాయ వ్యవస్థంటేనే జనాలకు అలుసయి పోతుంది, ప్రిసిడెంస్ అయి పోతుంది" అని.

పోలీసులతో జెయిలుకెళ్తున్న ఆమెను విలేఖరులు ప్రశ్నిస్తే ఆమె చెప్పింది."అడి దినాలు గాను! రెండేళ్ళ క్రితం నన్ను చెరిచినోడిని సాచ్చికాలు లెవ్వంటూ వదిలేసిండు. ఇదేం అన్యాలమని నిలదీయటానికి వచ్చినా. ఆడిని చూడంగనే నా ఒళ్ళు నాకు తెలవ లేదు. చెప్పు ఇసిరేసినా. ఆడ పుటుక పుట్టటమే నా పాపమా, చెప్పుండ్రి. ఆడు గురప్ప జెయిలు నుండి ఇదుదలై వచ్చిండు, నేను జెయిలు కెళ్తున్న!"

తప్పదు; న్యాయస్థానాల్లో న్యాయం, చట్టం మాత్రమే రాజ్యమేలుతున్నంత కాలం, ధర్మం 'తుట్టి' పడక తప్పదు. మన దేశంలో 'రూల్ ఆఫ్ లా'– చట్ట పాలన కొన సాగుతోంది. దానికి న్యాయం తప్ప ధర్మం తెలియదు.

(మల్లెతీగ-2010 రంజని-నందివాడ భీమారావు కథలపోటీలో ప్రత్యేక బహుమతిపొందిన కథ) **మల్లెతీగ** (మాసపత్రిక) అక్టోబరు 2011;

**స్వర్ణరంజని,** 50 సంవత్సరాల రంజని 70 కథలు (పు.320- 327)